అలసత్వంతో పనుల్లో జాప్యం



పనులను పరిశీలిస్తున్న పూలపల్లి కృష్ణారెడ్డి తదితరులు

బండ్లగూడ: అధికారుల అలసత్వం, స్థానిక నాయకుల నిర్లక్ష్యం కారణంగానే పనులు నత్తనడకన సాగుతున్నాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి అన్నారు. తాగునీటి పైపులైన్, రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పనుల్లో భాగంగా అత్తాపూర్ నుంచి పిఅండ్‌టి కాలనీ మీదుగా రావాల్సిన వాటర్ పైపులైన్ పనులు, రోడ్డు పనుల కారణంగా ఆగిపోయాయన్నారు. దీంతో రిజర్వాయర్లు నిర్మించి రెండేళ్లు కావస్తున్నా.. నిరుపయోగంగా ఉన్నాయన్నారు. అధికారులు బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి వేసవిలో నీటి కష్టాలు రాకముందే పైపులైన్ పనులు పూర్తి చేస్తే బండ్లగూడకు నీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, హిమాయత్‌సాగర్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, ఏ–బ్లాక్ అధ్యక్షుడు నవీన్, బీసీ సెల్ అధ్యక్షులు అంకం శ్రీనివాస్, తలారి ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీఎంను కలిసిన కిరణ్



మణికొండ: సినీ నటుడు, మనం సైతం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ సభ్యుడు కాదంబరి కిరణ్ సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కిరణ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ కార్యకలాపాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి సాధించాలని కిరణ్ ఆకాంక్షించారు.

కరాటేలో సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న సినీ నటుడు సుమన్

మణికొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం కేంద్రంగా ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన నిజి షోటోకాన్ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో కోకాపేటకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారు. కోకాపేటలోని ఎస్ఎస్‌కేఏ కరాటే అసోసియేషన్ ద్వారా పోటీల్లో పాల్గొన్న కె. లౌషిక్ బంగారు, కె. తనుష్ బ్రాంజ్ మెడల్స్ సాధించారని కోచ్ మాస్టర్ కె. రాజు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సినీ నటుడు సుమన్ ప్రత్యేకంగా అభినందించారని ఆయన పేర్కొన్నారు.

స్విమ్మింగ్‌లో సిల్వర్ మెడల్



సిల్వర్ మెడల్ సాధించిన శ్రీనివాస్

రాజేంద్రనగర్: గోవాలో జరిగిన ఆరో జాతీయ స్థాయి మాస్టర్స్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి కొంగళ్ల శ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాధించారు. దీంతో నిర్వాహకులు ఆయనకు మంగళవారం మెడల్స్ అందజేసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శ్రీనివాస్ ఇప్పటికే మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి మెడల్స్ సాధించాడు. శ్రీనివాస్‌ను స్నేహితులు, స్థానికులతో పాటు ఆర్టీసీ అధికారులు అభినందించారు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ డైరెక్టర్ సజ్జనార్ ప్రత్యేక ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొని మెడల్ సాధించగలుగుతున్నానని శ్రీనివాస్ పేర్కొన్నారు.

హైదర్‌గూడకు చెందిన పుల్లారెడ్డి..



స్విమ్మింగ్‌లో సత్తా చాటిన పుల్లారెడ్డి

అత్తాపూర్: నేషనల్ మాస్టర్స్, గోవా సూపర్ మాస్టర్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో అత్తాపూర్ హైదర్‌గూడకు చెందిన గంగిడి పుల్లా రెడ్డి 100 మీటర్లు, 200 మీటర్లు స్విమ్మింగ్ పోటీల్లో రెండు, మూడో స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. 54 ఏళ్ల వయస్సులో కూడా పుల్లారెడ్డి ఇటీవల ప్రకాశం బ్యారేజ్ కృష్ణ నదిలో 1.5 కిలోమీటర్లను కేవలం 33 నిమిషాల్లోనే చేరుకున్నాడు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా స్విమ్మింగ్‌ను హాబీగా చేసుకొని మానసికంగా శారీరకంగా ధృఢ విశ్వాసంతో ముందుకు సాగితున్నానన్నారు.

కమిషనర్‌కు వీడ్కోలు



కమిషనర్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్

మణికొండ: మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న కె.ఫల్గుణ్‌కుమార్‌కు మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చేందుకు కమిషనర్ ఎంతో కృషి చేశారన్నారు. మున్సిపల్ మేనేజర్ బీఎన్‌కే రమేశ్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, టీపీఓ సంతోష్‌సింగ్, కౌన్సిలర్ కె. లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్, బిల్ కలెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'ఎన్‌ఈపీ-2020 ఓరియంటేషన్'

రాయదుర్గం: మనూలో నాల్గవ జాతీయ విద్యావిధానం–2020పై ఓరియంటేషన్, సెన్సిటైజేషన్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. గచ్చిబౌలిలోని యూజీసీ–మాలవ్య మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్(ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా రెండుసార్లు ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 128 మంది పాల్గొన్నారు. ముఖ్యంగా అందరికీ సంపూర్ణ విద్య, శిక్షణ అందించడం, భారతదేశం కేంద్రీకృత నైతికత,బహుళ క్రమశిక్షణ, విద్య, భారతీయ విజ్ఞాన వ్యవస్థలు, విద్యా నాయకత్వ పాలన, నిర్వహణ, ఉన్నత విద్య, సమాజం, పరిశోధన, అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి తదితరాలపై ఫ్యాకల్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



శివరాంపల్లి రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట!

- ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రయాణికులు



బాత్‌రూమ్‌లకు వెళ్లకుండా నట్లు బిగింపు



నిరుపయోగంగా ఉన్న మంచి నీటి కులాయి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శివరాంపల్లి రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కుళాయిలు పనిచేయక తాగునీరు దొరకడం లేదు. వాష్‌రూం ఉన్నా.. వినియోగంలో లేదు. ఆవరణంతా అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో భయందోళన చెందుతున్నారు. ఈ మధ్య ఓ అమ్మాయి ఆర్వోబీకి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇవేగాకుండా పోకిరీలు మద్యం తాగి పట్టాలపై నడుచుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు మహిళలు, యువతులు ఒంటరిగా ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. గత 40 ఏళ్లుగా ఈ స్టేషన్‌లో రైల్వే గేట్ ఉండేది. శివరాంపల్లి నుంచి బాబుల్‌రెడ్డి నగర్ , సాయిబాబనగర్‌కు రోడ్డు ఉండేది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉన్నప్పటికీ ఎలాంటి సంఘటనలు జరుగలేదు. కానీ ఈ స్టేషన్‌లో గేట్ తీసేసి రోడ్డును మూసివేయడంతో శివరాంపల్లి స్టేషన్ నిర్మానుష్యంగా మారిపోయింది. ప్రయాణికులు సంఖ్య కూడా బాగా తగ్గిపోయింది.స్టేషన్‌లో ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు టిక్కెట్లు ఇచ్చిన తర్వాత లైట్లు లేక అంతా చీకటిమయం అవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికులకు కనీస వసతులు కల్పించి, సెక్యూరిటీని నియమించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాత్రి సమయంలో ఎవరూ ఉండరు..



శివరాంపల్లి రైల్వేస్టేషన్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సెక్యూరిటీ లేకపోవడంతో పోకిరులు మద్యం తాగి అక్కడి ఇనుప చువ్వలు, లెయిలింగ్ ఎత్తుకెళ్లారు.స్టేషన్‌లో లైట్లు సరిగా వెలగకపోవడం, తాగునీరు , వాడుక నీరు అందుబాటులో లేదు. రాత్రి సమయంలో స్టేషన్‌లోకి మహిళలు, యువతులు ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా వసతులు కల్పించడంతో పాటు సెక్యూరిటీ గార్డులను నియమించాలి. -రాజు స్థానికుడు

'బీఆర్‌ఎస్ నేతల అవినీతిలో చెరువులు మాయం'



జోషికుంట సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న సెల్లార్ పనులను చూపిస్తున్న నేతలు

శంషాబాద్: రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అండదండలతో ఆ పార్టీ నేతల అవినీతి, అక్రమాలు శంషాబాద్‌లో విచ్చలవిడిగా సాగుతున్నాయని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, పి.సంజయ్‌యాదవ్ ఆరోపించారు. పట్టణంలోని సర్వేనంబర్ 325లో జోషికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీ సెల్లార్ తవ్వి చేపడుతున్న అక్రమ నిర్మాణం వెనక బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులే ఉన్నారన్నారు. 7 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో ఉండాల్సిన జోషికుంట ఇప్పటికే సగానికి కుంచించుకుపోయిందన్నారు. కొన్ని నెలలుగా ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ఎఫ్‌టీఎల్‌లో చేపడుతున్న నిర్మాణంతో భవిష్యత్‌లో చెరువు పూర్తిగా కనమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అయినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ప్రతి సమస్యను తీసుకెళ్తానని, తద్వారా అవినీతి అక్రమాలకు చెక్‌పడుతుందన్నారు. కార్యక్రమంలో అక్రమ్‌ఖాన్, శ్రీధర్, శ్రీధర్ యాదవ్, కొంకరి రాజు, అర్జున్ యాదవ్, బండి పెంటయ్య, శ్రీను, రమేశ్, రాజ్‌కుమార్, యాదయ్య ఉన్నారు.

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతాం



కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బండ్లగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతామని సీఐటీయూ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గండిపేట మండల కమిటీ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించేందుకు బీజేపీ ప్రభుత్వం అంగీకరించట్లేదని, అలాగే ఈపీఎఫ్ పెన్షన్‌ను నెలకు రూ. 10 వేలు పెంచాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్ పరం చేసిందన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ మొదటి ప్రాధాన్యతగా డబుల్ బెడ్రూం ఇండ్లు, స్థలాలు కేటాయించాని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి కార్మిక చట్టాలను అనుకూలంగా మార్చాలన్నారు. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 16న నిర్వహించే సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు యాదగిరి, సురేశ్, వెంకటేశ్, జగన్, సుభాష్, ట్రోఫిక్ పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ఆర్‌ఏఎంఎంపీ సదస్సు



సదస్సులో పాల్గొన్న అతిథులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో 'రీసెంట్ అడ్వాన్స్ సెస్ ఇన్ మెటీరియల్స్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్' అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్, ఎంజీఐటీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు విశిష్ట అతిథిగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ ప్రొడక్షన్, మార్కెటింగ్ విభాగాధిపతి డాక్టర్ ముత్తుకుమార్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ కోమల్ కపూర్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వేతర సాంకేతిక కళాశాలల్లో ఎంజీఐటీలో మాత్రమే మెటలర్జికల్, మెటీరియల్ ఇంజినీరింగ్, మెకట్రానిక్స్ వంటి విభాగాలను సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో కృషి చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మెటీరియల్ ఇంజినీరింగ్‌లోని నూతన పోకడలు, మానుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్‌లోని విప్లవాత్మక మార్పులను వివరించారు. కార్యక్రమంలో ఎంజీఐటీ ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



లేబర్ అడ్డాలో బోర్లు వేయిస్తున్న యజమానులు

మణికొండ: అనుమతుల్లేకుండా ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి నీటి వ్యాపారం చేస్తున్నవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ, ఔటర్‌రింగ్ రోడ్డు పక్కన ఉన్న అశోకాలివియానా టవర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం తమ టవర్స్ పక్కన పర్మిషన్ లేకుండా బోర్లు వేస్తుండడంతో తహసీల్దార్ గోవర్ధన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. బోర్లు వేసి ట్యాంకర్లకు నీటిని విక్రయించడంతో పాటు ఖాళీ స్థలంలో గుడిసెలు వేసి అద్దెకు ఇస్తున్నారన్నారు. అక్కడ ఉంటున్న కార్మికులు ఆవరణలో చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తుందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి గుడిసెలను తొలగించాలని ఆయన కోరారు.

నార్సింగి కమిషనర్ బాధ్యతల స్వీకరణ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్‌గా కొడంగల్ నుంచి బదిలీపై వచ్చిన టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు సహకరించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

నార్సింగి ఏసీపీగా రమణగౌడ్



మణికొండ: నార్సింగి ఏసీపీగా జి.వెంకటరమణగౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు పనిచేసిన ఎస్. లక్ష్మీనారాయణను రాజేంద్రనగర్ ఏసీపీగా బదిలీ చేసింది. నార్సింగి కేంద్రంగా ఏసీపీ పోస్టు మంజూరైన సమయంలో మొదటి ఏసీపీగా వచ్చిన వెంకటరమణగౌడ్ అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కొద్ది రోజులకే బదిలీ అయ్యారు. తర్వాత విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేసిన ఆయన తిరిగి మళ్లీ నార్సింగికే ఏసీపీగా వచ్చారు. గతంలో ఆయన నార్సింగి సీఐ గాను పనిచేశారు. బుధవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రాజేంద్రనగర్ ఏసీపీ, ఆర్డీఓ బదిలీ

రాజేంద్రనగర్: లోకసభ ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ గంగాధర్ బదిలీ అయ్యారు. దీర్ఘకాలికంగా విధులు నిర్వహిస్తున్న ఆయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ప్రస్తుతం ఏసీపీగా ఇంకా ఎవరిని నియమించలేదు. ఇప్పటికే అదనపు డీసీపీ రేష్మిని టాస్క్‌ఫోర్స్‌కు, అలాగే రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యను సైతం ట్రాన్స్‌ఫర్ చేశారు.

గ్రామీణబంద్‌ను విజయవంతం చేయాలి

శంషాబాద్: ఈ నెల 16 దేశవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామీణబంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వనర్ నీరటి మల్లేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలకు నిరసనగా చేపడుతున్న బంద్‌లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గృహిణి అదృశ్యం



లక్ష్మి

అత్తాపూర్: ఇంట్లో నుంచి బయటికు వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఏఎస్సై మహ్మద్ అర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌లోని పాండురంగానగర్‌కు చెందిన లక్ష్మి కల్లుకు బానిస అయ్యింది. దీంతో ప్రతి చిన్న విషయానికి గొడవ పడేది. ఈ నెల 10 న లక్ష్మి తన 8 నెలల బాలుడిని వదిలేసి వెళ్లిపోయింది. దీంతో భర్త, కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. భర్త శివ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ



మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైస్ చైర్మన్, బీజేపీ కౌన్సిలర్లు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. అందులో భాగంగా మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా సుదీర్ఘకాలంగా పనిచేసిన కె. ఫల్గుణ్‌కుమార్‌ను తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(టీయుఎఫ్ఐడీసీ) అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను నియమించింది. కుమారుడి వివాహంతో సెలవులో ఉన్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ మున్సిపాలిటీకి బదిలీ చేయగా, ఆయన స్థానంలో కొడంగల్ మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఇక్కడ నియమించింది.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన కమిషనర్..

మణికొండ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన ఘనత కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌కే దక్కుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కమిషనర్ బదిలీ కావడంతో కౌన్సిలర్లతో పాటు ఆయన సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ పార్కులు, కూడళ్లు, శ్మశానవాటికలు, మరుగుదొడ్లు, క్రికెట్ స్టేడియం, నర్సరీలు పలు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణంతో పాటు శానిటేషన్, ప్లాంటేషన్ రంగాల్లో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. అంతేగాకుండా కూరగాయల మార్కెట్, మున్సిపల్ నూతన కార్యాలయాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్‌స్వామి, బి.శ్వేతారవికాంత్‌రెడ్డి, ఎల్. వందన నగేశ్, కోఆప్షన్ సభ్యులు జె. సిద్దప్ప, జె. లక్ష్మీరాములు పాల్గొన్నారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడిని దర్శించుకున్న భక్తులు



మణికొండ: అయోధ్యలోని బాల రాముడిని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని భక్తులు మంగళవారం దర్శించుకున్నారు. రెండు రోజుల క్రితం నార్సింగి బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్. భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో అయోధ్యకు తరలివెళ్లారు. తర్వాత అక్కడి నుంచి కాశీకి బయలుదేరినట్టు వారు పేర్కొన్నారు.

కుక్క దాడిలో 10 మందికి గాయాలు







కుక్క దాడిలో గాయపడిన స్థానికులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం ఓ వీధి కుక్క 10 మందిపై దాడి చేసింది. వాహనాలపై వెళ్తున్న వారిని సైతం వెంబడించి ప్రతాపం చూపింది. సెక్యూరిటీ గార్డు, ప్రభుత్వోద్యోగి, స్కూల్‌కు వెళ్తున్న బాలుడితో పాటు మొత్తం 10 మందిని కరిచింది. ఈ ప్రాంతంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హెచ్‌సీయూలో బయో అన్వేషణ-2024

ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహణ

రాయదుర్గం: ప్రతిష్టాత్మకమైన బయోఅన్వేషణ–2024ను నిర్వహణకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వేదికకానుంది. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బయో అన్వేషణ్ అనేది జీవశాస్త్రం యొక్క రహస్యాలను అన్వేషించడంలో మానవాళికి ఉపయోగపడే సాంకేతికతలోని అంశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమాలు సాగుతాయి. పలువురు శాస్త్రవేత్తలు, బయోటెక్నాలజీ రంగంలోని నిపుణులను భాగస్వాములను చేస్తారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ రాజేష్ గోఖలే, ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, నోబెల్ గ్రహీత రిచర్డ్ జే రాబర్ట్స్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

18న మహర్షి దయానంద సరస్వతి జయంతి

రాయదుర్గం: ఆర్యసమాజ్ సంస్థాపకుడు మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను ఈ నెల 18న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, తెలుగు రాష్ట్రాల ఆర్యసమాజ్ ప్రతినిధి డాక్టర్ ధర్మతేజ వెల్లడించారు. ఈ మేరకు వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటలకు శోభాయాత్ర కూడా ఉంటుందన్నారు. ఒక ప్రచార రథాన్ని తయారుచేసి ఉభయ రాష్ట్రాలలోని అన్ని గ్రామాలలో మహర్షి దయానందుని బోధనలను, ప్రదేశాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

ప్రపంచ భాషల్ని కలుపుకోగలిగే శక్తి తెలుగుకే ఉంది

మహా సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్



రాయదుర్గం: ప్రపంచంలోని అనేక భాషలను తనలో కలుపుకోగలిగే సహజత్వాన్ని కల్గొని మహత్తర శక్తి తెలుగు భాష సొంతమని మహాసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మానవీయ శాస్త్రాల ఆడిటోరియంలో 'వెయ్యేళ్ల తెలుగు పద్య సాహిత్య వైభవం' అనే అంశంపై తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ తెలుగు ద్రావిడ భాషా జన్యమే అయినా, అధికంగా సంస్కృత ప్రభావం ఉందని, దాని వల్ల వేద సంస్కృతి తెలుగుభాషలో కనిపిస్తుందని చెప్పారు. మానవుల మనస్తత్వం ఆంధ్ర మహాభారతంలో ఉందని, దానిని నన్నయ ఎంతో పరిశీలనతో వివిధ పాత్రల రూపంలో సృజనీకరించారన్నారు. మానవీయ శాస్త్రాల విభాగం డీన్ కృష్ణ మాట్లాడుతూ ఇతర భాషలతో పోలిస్తే తెలుగుకు గొప్ప రమణీయత, ఇతర భాషల్లో లేని అనేక ప్రక్రియలు ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆచార్యులు పిల్లలమర్రి రాములు, గోనానాయక్, పమ్మి పవన్‌కుమార్, విజయలక్ష్మి, ,వారాజారాణి, భూక్యా తిరుపతి,బాణాల భుజంగరెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.